# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-07-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ధవళేశ్వరం బ్యారేజీ ఆధునీకరణ పనులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు శంకుస్థాపన చేస్తారు.**

2. **తెలంగాణకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులతో ఈ రోజు సమీక్షా సమావేశం నిర్వహిస్తారు.**

3. **ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా పలాసలో ప్రతిపాదిత విమానాశ్రయాన్ని పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్మిస్తామని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.**

4. **'సంజీవని' పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మెరుగైన ఆరోగ్య సేవలు అందించనున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.**

==========================

ఉభయ గోదావరి జిల్లాలకు సాగునీరు, తాగునీటికి ప్రధాన ఆధారమైన ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ఆధునీకరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సుమారు 152 కోట్ల 95 లక్షల రూపాయల వ్యయంతో బ్యారేజీలోని 117 వరద గేట్ల మార్పిడి పనులకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పిచ్చుకలంక వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు శంకుస్థాపన చేస్తారు. ఈ ప్రాజెక్టులో వరద గేట్లతో పాటు ఇతర యాంత్రిక పరికరాలను కూడా ఆధునీకరించనున్నారు. పనులు పూర్తయితే బ్యారేజీ భద్రత, వరద నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడతాయని అధికారులు తెలిపారు.

--------------------------

శస్త్రచికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముంబైలో నిన్న పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడిన ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్ ఆరోగ్యం మెరుగుపడుతోందని, విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారని తెలిపారు.

వాయిస్ 29 సెకన్లు

అలాగే వియత్నాంలో జరిగిన పడవ ప్రమాదాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. మృతి చెందిన వారికి భౌతికకాయాలను స్వస్థలాలకు చేర్చడంతో పాటు, అక్కడ ఉన్న మిగిలిన

పర్యాటకులను సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం కొనసాగుతోందని చెప్పారు.

---------------------------

కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ ఈరోజు, రేపు సింగరేణి భరోసా యాత్ర నిర్వహించనుంది. తెలంగాణలోని కొత్తగూడెం నుంచి మంచిర్యాల వరకు సాగే ఈ యాత్రలో సింగరేణి కార్మికులతో సమావేశాలు, ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ యాత్రలో నాలుగు జిల్లాల్లో మూడు బహిరంగ సభలు, ఐదు చోట్ల కార్మికులతో సమావేశాలు ఏర్పాటు చేశామని, సింగరేణి కార్మికులు, ఉద్యోగులకు భరోసా కల్పించడమే యాత్ర లక్ష్యమని రాష్ట్ర బీజేపీ తెలిపింది. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డితో పాటు తెలంగాణ బీజేపీ అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు, పార్టీ పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, ఎమ్మెల్సీలు యాత్రలో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా పలాసలో ప్రతిపాదిత విమానాశ్రయాన్ని పూర్తిగా ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నిర్మిస్తామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. విమానాశ్రయ ఏర్పాటు, భూసేకరణపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నిన్న ఆయన మాట్లాడారు. 'ఉడాన్' పథకం కింద ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిధులతో ఈ ప్రాజెక్టు అమలు చేస్తామన్నారు. విమానాశ్రయంతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు కూడా భూమిని కేటాయిస్తున్నామని కేంద్ర మంత్రి తెలియజేస్తూ...

వాయిస్ 30 సెకన్లు

---------------------------

పార్లమెంటు సమావేశాలు త్వరలో ప్రారంభం కానున్ననేపథ్యంలో తెలంగాణకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులతో ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరగనున్న ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుఇతర ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రాజెక్టులు, అనుమతులు, నిధులకు సంబంధించిన అంశాలను ఎంపీలకు వివరించి, పార్లమెంట్ సమావేశాల్లో వాటి సాధన కోసం సమన్వయంతో కృషి చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------

వియాత్నాంలో జరిగిన పడవ ప్రమాదంలో మృతి చెందిన గెల్లి జయశ్రీ కుటుంబ సభ్యులను ఆంధ్రప్రదేశ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విజయవాడలో నిన్న పరామర్శించారు. మొగల్రాజపురంలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మృతురాలి భౌతికకాయం ఈరోజు సాయంత్రానికి విజయవాడకు చేరుకుంటుందని తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారని చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర భరోసా ఇచ్చారు.

---------------------------

ప్రజా ఆరోగ్య సేవలను మెరుగుపరచడంతో పాటు ఆర్థికంగా వెనుకబడిన రోగులకు అండగా నిలవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో 73 మంది లబ్ధిదారులకు 63 లక్షల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన నిన్న పంపిణీ చేశారు. త్వరలో ప్రారంభం కానున్న 'సంజీవని' పథకం ద్వారా రోగుల వివరాలను సేకరించి రాష్ట్రవ్యాప్తంగా మెరుగైన ఆరోగ్య సేవలు అందించనున్నట్లు మంత్రి తెలుపుతూ,

వాయిస్ 31 సెకన్లు

---------------------------

రాజకీయాల్లో మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు స్ఫూర్తిదాయక వ్యక్తి అని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విశాఖపట్నంలో జరిగిన 'వెంకయ్య నాయకుడు' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడుతో కలిసి ఆమె పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ, రైతు కుటుంబం నుంచి దేశ ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగిన వెంకయ్య నాయుడు యువతకు ఆదర్శమని, ఆయన జీవితం రాబోయే తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

అనారోగ్యంతో శనివారం కన్నుమూసిన ప్రముఖ గాయని ఎస్. జానకి అంత్యక్రియలను కర్ణాటకలోని మైసూరులో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిన్న నిర్వహించారు. అంతకుముందు మైసూరు మహారాజా కళాశాల మైదానంలో ప్రజల సందర్శనార్థం ఆమె పార్థివదేహాన్ని ఉంచగా, పెద్ద సంఖ్యలో అభిమానులు, సినీ, రాజకీయ, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖులు ఆమెకు నివాళులర్పించారు. అనంతరం జానకి మనవరాలు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. వేలాది పాటలతో భారతీయ సంగీత ప్రపంచంలో ఎస్. జానకి చెరగని ముద్ర వేశారని... ఆమె మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం ప్రాంతాల్లో దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ, వాయువ్య దిశల నుంచి గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, యానాంలోని పలు ప్రాంతాల్లో ఈరోజు ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

ఇక తెలంగాణ రాష్ట్రంలో రానున్న ఐదు రోజుల పాటు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================